ప్రజాశక్తి
మంగళవారం 24 సెప్టెంబర్ 2024

ఎల్ఐసి కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష కార్మిక సంఘాల నాయకులు

బదిలీలపై గరంగరం

- ◆ నేతల సిఫార్సులు బుట్టదాఖలు
- ◆ కలెక్టరేట్‌లో ఓ అధికారి చక్రం తిప్పారన్న ఆరోపణలు
- ◆ నేతల ఫిర్యాదులతో అంతర్గత విచారణ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే ఉద్యోగుల బదిలీలను చేపట్టింది. ఆగస్టు నెలలోనే దీనికి ఉత్తర్వులిచ్చిన విషయం తెలిసిందే. ఎన్నికల అనంతరం కొత్త ప్రభుత్వం వస్తూనే బదిలీ కావడంతో ఇది వరకు ప్రాధాన్యత పోస్టుల్లో కాకుండా ఉంటూ వచ్చిన వారందరూ ఇక తమకు ప్రాధాన్యత పోస్టులు వక్కుతాయని ఆశించారు. ఈ మేరకు నేతల సిఫార్సులకు పెద్దఎత్తున బారులుదీరారు. నేతలు కూడా తమకు అనుకూలమైన అధికారులను తీసుకొచ్చేందుకు లేఖలను ఇచ్చారు. అయితే పోస్టింగ్‌లకు వచ్చే సరికి వారు సిఫార్సులు చేసిన వారికి కాకుండా ఇతరులకు పోస్టింగ్‌లొచ్చాయి. దీంతో నేతల్లో తీవ్రమైన అసంతృప్తి వ్యక్తమవుతోంది. తమ సిఫార్సు లేఖలకు ప్రాధాన్యత లేదా అని అసంతృప్తితోనున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు తమ సమస్యను ముఖ్య ప్రజాప్రతినిధి దృష్టికి కూడా తీసుకెళ్లినట్టు సమాచారం. దీనిపై ఆయన ఉన్నతాధికారితో ఆరా తీయగా అది కింది స్థాయి అధికారులకే అప్పగించినట్టు ఆయన చెప్పినట్టు తెలుస్తోంది. దీంతో బదిలీల్లో ఏమి జరిగిందన్న దానిపై విచారణ జరిపి నివేదికివ్వాలని కోరినట్టు తెలుస్తోంది.

ఒక అధికారియే చక్రం తిప్పారన్న ఆరోపణలు

ఎన్నికల సమయంలో ఇక్కడ బాధ్యతలు చేపట్టిన ఒక జిల్లా అధికారియే బదిలీల్లో మొత్తం చక్రం తిప్పారన్న ఆరోపణలున్నాయి. ప్రధానంగా రెవెన్యూలో ఉద్యోగుల బదిలీల్లో నేతలతో పనిలేదు.. తానే కోరుకున్న చోటుకు వేస్తా కదా చెప్పి అనుకూలమైన వారిని అనుకూలమైన పోస్టింగ్‌లు ఇచ్చినట్టు తెలుస్తోంది. దీంతో ప్రజాప్రతినిధుల్లో తీవ్రమైన అసంతృప్తికి దారితీస్తోంది. కొత్తగా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తమ సిఫార్సులనే ఏ మాత్రం పట్టించుకోకుండా వారికి ఇష్టం వచ్చినట్టు బదిలీలు చేయడం ఏమిటని మండిపడుతున్నారు. బదిలీల్లో కనీస ప్రాధాన్యతనివ్వకపోవడం ఏమిటని ముఖ్య ప్రజాప్రతినిధిని అడగటంతో ఆయన ఏమి జరిగిందన్న దానిపై ఆరా తీశారు. దీనిపై విచారణ చేపట్టి నివేదికివ్వాలని చెప్పడంతో బదిలీ ప్రక్రియ రసకందాయంలో పడింది. ఇప్పుడు సదరు ఉన్నతాధికారులపై ఏ రకమైన చర్యలుంటాయన్న దానిపై చర్చ నడుస్తోంది. ఎందుకంటే బదిలీల్లో కీలకంగా వ్యవహరించిన సదరు అధికారి వైసిపి ప్రభుత్వ హయంలో ఇక్కడికి వచ్చారు. ఇప్పుడూ ఆయనే కొనసాగుతున్నారు. దీంతో నేతలకు ఆయనపై అగ్రహంతోనున్నట్టు తెలుస్తోంది. ఇక ఇతర శాఖల్లోనూ కొంత మంది అధికారులు బదిలీల్లో ఇదే రకంగా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. అన్నింటినీ పరిశీలించనున్నారు. దీంతో ఇప్పుడు జరిగిన బదిలీల్లో అయోమయం, గందరగోళం నెలకొంది.

కార్మిక చట్టాల సవరణతో దేశ సమగ్రతకు ముప్పు

బ్లాక్ డే నిరసనలో కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా చట్టాలు చేయడం దేశ సమగ్రతకే ముప్పు అని కార్మిక సంఘాల నాయకులు విమర్శించారు. కార్మిక చట్టాల సవరణ, కేంద్ర ప్రభుత్వ ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అనంతపురం ఎల్ఐసి కార్యాలయం వద్ద బ్లాక్ డే నిరసనను సోమవారం నిర్వహించారు. ఈ నిరసనలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజారెడ్డి, ఐఎఫ్‌టియు సురేష్ హాజరై మాట్లాడారు. అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ కంపెనీలకు లాభం చేసేలా ప్రధాని నరేంద్ర మోడీ పాలన సాగిస్తున్నారని చెప్పారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ పారిశ్రామిక వివాదాల చట్టం, సామాజిక భద్రతా చట్టాలను సవరణ చేయడం వల్ల అసంఘటిత రంగంలోని నిర్మాణరంగ కార్మికులందరికీ నష్టం వాటిల్లుతుందన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరించే విధానాలనూ అమలు చేస్తుండడం దుర్మార్గం అన్నారు. పంటల బీమా పథకాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టారంటే రైతులపై వారికి ఏమాత్రం ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయకుండాన్ని మోసగించడం దారుణమన్నారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చి, విభజన చట్టంలోని హామీలు అమలు చేయాలన్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలపై పన్నులు భారం తగ్గించి ప్రభుత్వ ఆదాయం కోసం కార్పొరేట్ కంపెనీలపై పన్నుల భారం పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో వామపక్ష కార్మిక సంఘాల నాయకులు ఎం.నాగమణి, మన్నీల రామాంజనేయులు, వెంకట నారాయణ, నాగభూషణం, ఎటిఎం.నాగరాజు, ఎర్రిస్వామి, ఆదినారాయణ, ఆజాంబాషా, రాజేష్ గౌడ్, చిరంజీవి, కృష్ణుడు, మల్లికార్జున, యేసురత్నం, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, పుష్పరాజు, లక్ష్మీ నరసమ్మ, మంత్రి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నీటి వనరులపై

ప్రభుత్వం దాగుడుమూతలు : సిపిఎం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

తుంగభద్ర, హంద్రీనీవా నుంచి జిల్లాకు పూర్తిస్థాయి నీటిని తీసుకురావడంలో ప్రభుత్వం దాగుడుమూతలు ఆడుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ విమర్శించారు. రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి జిల్లా పర్యటన నేపథ్యంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హెచ్ఎల్‌సి ఆధునికీకరణ, హంద్రీనీవా ఆయకట్టు భూములకు సాగునీరు విషయంలో నీటిపారుదల శాఖ మంత్రి జిల్లా పర్యటన సందర్భంగా స్పష్టంగా ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. తుంగభద్ర డ్యాం పొంగిపొర్లుతున్నా జిల్లాకు రావాల్సిన నీరు తెచ్చుకోలేని స్థితిపై ప్రభుత్వం తగిన శ్రద్ధ పెట్టడం లేదన్నారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి చెప్పినట్టు ప్రతి ఎకరాకు నీరు ఎలా ఇస్తారో చెప్పకుండా ప్రకటనలు ద్వారా ఏం ఉపయోగం ఉండదన్నారు. తుంగభద్ర డ్యాం భద్రత గురించి ఆర్ఆర్ బజాజ్ ఇచ్చిన రిపోర్ట్‌పై ప్రభుత్వం ఏమి చేయనుందో చెప్పాలన్నారు. హెచ్ఎల్‌సి ఆధునికీకరణ పనులు పూర్తి చేస్తారో.. లేదో.. చెప్పకుండా రాజకీయ విమర్శలు చేయడం వల్ల జిల్లా ప్రజలకు ఏం ప్రయోజనం అన్నారు. నీటి విషయంలో గత ప్రభుత్వం తీవ్రంగా తప్పులు చేసినందునే అన్ని స్థానాల్లో ఆ పార్టీని ఓడించారని గుర్తు చేశారు. ఆ అనుభవాన్ని గుర్తించి జిల్లా నీటిపారుదల నిర్వహణకు అవసరమైన నిధులను ప్రస్తుత ప్రభుత్వం కేటాయించాలన్నారు. శ్రీశైలం డ్యాం నిండినా హంద్రీనీవా కాలువ సామర్థ్యంలో సగానికి కూడా నీరు వచ్చే పరిస్థితి లేదని మంత్రి ప్రకటించడం జిల్లా రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోందన్నారు. రోజూ 380 క్యూసెక్కుల మాత్రమే వస్తే జిల్లాలోని చెరువులు, కుంటలు నింపే అవకాశం లేదన్నారు. ఇప్పటికైనా జిల్లా నీటిపారుదల అభివద్ధికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలు ఆందోళనలకు సిద్ధపడుతారన్న విషయాన్ని పాలక ప్రభుత్వం గుర్తించాలని తెలిపారు.

ఘటనా స్థలంలో పరిస్థితి...

'మీద పడిన మృత్యువు' భార్యాభర్తలు మృతి

ప్రమాదంలో మృతి చెందిన భార్యాభర్తలు (ఫైల్‌ఫొటో)

అనంతపురం నగర శివారులోని నేషనల్ పార్కు వద్ద సోమవారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆదివారం నాడు తమ కూతుళ్లు, మనవళ్లుతో సంతోషంగా గడిపేందుకు వెళ్లి తిరుగు ప్రయాణంలో సోమవారం ఉదయం ఇంటికి వస్తూ ప్రమాదంలో గుత్తి మండల పరిధిలోని అబ్బేదొడ్డి గ్రామానికి చెందిన హనుమంత రెడ్డి (70), రంగమ్మ(65) భార్యాభర్తలు మృత్యువాత పడ్డారు. ఈ ఘటన బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. వార్త మెయిన్

పంచాయతీ కార్యదర్శులు బదిలీ

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలో విధులు నిర్వహిస్తున్న పలువురు పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేసినట్లు జిల్లా కలెక్టర్ నుంచి సోమవారం ఆదేశాలు వచ్చినట్లు ఎంపిడిఒ షకీలా బేగం తెలిపారు. వారిలో బొమ్మనహాల్‌లో పని చేస్తున్న బాబాఫకృద్దీన్ బుక్కరాయసముద్రంకు, ఉంతకల్లులో పని చేస్తున్న రవి విడపనకల్లు మండలానికి, బొల్లనగుడ్డంలో పని చేస్తున్న లోకేష్ కరకముక్కలకు, హొన్నూరులో పని చేస్తున్న కుళ్లాయిస్వామినాయుడు రాప్తాడు మండలంలోని బండమీదపల్లికి, శ్రీధరఘట్టలో పని చేస్తున్న శివయ్య ఉద్దేహాల్‌కు బదిలీ అయినట్లు ఆమె తెలిపారు. అలాగే నాగరాజు, కృష్ణారావు బొమ్మనహాల్‌కు, గోవింద రెడ్డి ఉంతకల్లుకు, వెంకటేశులు హొన్నూరుకు, డి.వెంకటేశులు బండూరుకు బదిలీపై వచ్చినట్లు ఆమె తెలిపారు.

ధర్మవరంలో ఉద్రిక్తత

- ◆ బిజెపి, వైసిపి నాయకుల మధ్య ఘర్షణ
- ◆ రాత్రి 7గంటల వరకు కొనసాగిన టెన్షన్
- ◆ ఇరు పార్టీలకు సర్దిచెప్పిన పోలీసులు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

సబ్ జైలు వద్ద కూటమి శ్రేణులు ఆందోళన

ధర్మవరంలో ఉద్రిక్తత నెలకొంది. బిజెపి, వైసిపి నాయకులు ఒకరిపై ఒకరు ప్రత్యక్ష దాడులకు తెగబడ్డారు. సాధరణంగా మొదలైన వివాదం చిలికిచిలికి గాలివానలా మారింది. మాటామాట పెరిగి ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. పట్టణ నడిబొడ్డున కాలేజీ సర్కిల్లో మధ్యాహ్నం ప్రారంభం అయిన వివాదం రాత్రి ఏడు గంటల వరకు కొనసాగింది. ఇరు పార్టీ వారు పెద్ద ఎత్తున గుమిగూడి పరస్పర దాడులు చేసుకోవడంతో టెన్షన్ వాతావరనం నెలకొంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ధర్మవరం సబ్ జైలులో రిమాండ్‌లో ఉన్న ఉన్న వైసీపీ కార్యకర్తలను పలకరించేందుకు మాజీ శాసనసభ్యుడు కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరాడు. వీరి వాహనాలు కాలేజీ సర్కిల్లోనే యుటర్న్ వద్దకు రాగానే అదే సమయంలో ఎదురుగా ఉన్న హోటల్‌లో మధ్యాహ్నం భోజనం ముగించుకుని మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యాలయ సిబ్బంది, స్థానిక బిజెపి నాయకుల వాహనాలు ఎదురుగా వచ్చాయి. రెండు వైపులా వాహనాలు తిప్పుకునే క్రమంలో రెండు పార్టీల నాయకులు వాదోపవాదాలు చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వాహనంలో ఉండగా దానికి బిజెపి నాయకులు అడ్డుపడ్డారు. దీంతో కేతిరెడ్డి కారు డ్రైవర్ వేగంగా వాహనాన్ని ముందుకు నడిపాడు. ఈ సమయంలో ఇద్దరు బిజెపి నాయకులకు గాయాలు అయినట్లు ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.

కూటమి శ్రేణుల ఆందోళన

కాలేజీ సర్కిల్ వద్ద పెద్ద ఎత్తున ఘర్షణ జరుగుతుందన్న విషయం తెలుసుకున్న టిడిపి, బిజెపి, జనసేన నాయకులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. వైసిపి నాయకులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కేతిరెడ్డి వాహనంను కూటమి కార్యకర్తలు మరోసారి అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆందోళన నడుమనే కేతిరెడ్డి తన సబ్‌జైలు లోపలికి వెళ్లిపోయాడు. సబ్‌జైలు ఎదుట కూటమి శ్రేణులు ఆందోళనకు దిగారు. కేతిరెడ్డి, వైసిపికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ధర్మవరానికి ప్రత్యేక బలగాలు

వైసిపి, బిజెపి మధ్య ఘర్షణ తీవ్ర రూపం దాల్చడంతో పెద్ద సంఖ్యలో పోలీసులు ధర్మవరానికి చేరుకున్నాయి. అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఇరు పార్టీల కార్యకర్తలను హెచ్చరించి గుంపులు లేకుండా అక్కడి నుండి పంపే ఏర్పాటు చేశారు. కేతిరెడ్డితో పాటు ఆయన అనుచరులని సాయంత్రం 7 గంటల వరకు సబ్ జైలులోనే ఉంచారు. ఇక కూటమి నేతలను ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించి వారితో చర్చలు జరిపారు. ప్రశాంతతకు సహకరించాలని కోరారు. ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని అడిషనల్ ఎస్పీ హామీ ఇచ్చారు. 7గంటల అనంతరం పరిస్థితి అదుపులోకి రావడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. రెండు పార్టీల ఘర్షణ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటు చేసుకోకుండా పోలీసులు ప్రత్యేక బలగాలతో పట్టణంలో బందోబస్తు నిర్వహిస్తున్నారు.

అధికారం పోయినా దౌర్జన్యాలు : చిలకం

వైసిపి ఎన్నికల్లో అధికారం కోల్పోయిన ఇంకా దౌర్జన్యం చేయాలని చూస్తోందని జనసేన రాష్ట్ర నాయకులు చిలకం మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. వైసిపి, కూటమి శ్రేణుల ఘర్షణ నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేతిరెడ్డికి గత ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారన్నారు. ఇకనైనా ఆయన మారాలని, లేకపోతే ధర్మవరం ప్రజలు మరింత గుణపాఠం చెబుతారన్నారు. ఘటనపై మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యాలయం సిబ్బంది హరీష్ స్పందించారు. ఘర్షణలు రేపే విధానాలకు వైసిపి నాయకులు స్వస్తి పలకాలని హితవు పలికారు.

నూతన రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మాట్లాడుతున్న ఎపిఎం నీలవేణి

ఆయా గ్రామ సంఘాలు రికవరీలు చెల్లించి నూతన రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చని వెలుగు ఎపిఎం నీలమణి సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం గ్రామ సంఘాల వివోఎల తో గ్రామ సంఘాలపై సమీక్ష సమావేశం నిర్వహించగా వేపులపర్తి యూనియన్ బ్యాంక్ మేనేజర్ రాజశేఖర్‌రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ మధుసూదన్ హాజరయ్యారు. ఎపిఎం మాట్లాడుతూ గ్రామ సంఘాల్లోని సభ్యులు తమ రికవరీని చెల్లించి నూతన లోన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సభ్యులు తమ వివరాలను సంబంధిత యానిమేటర్‌కు ఇవ్వాలన్నారు. బ్యాంకు లింకేజీతో అతి తక్కువ వడ్డీతో రుణాల మంజూరుకు బ్యాంకులు సహకారం అందిస్తాయన్నారు. సమావేశంలో సిసిలు దొనతిమ్మ, వేణుగోపాల్, అకౌంటెంట్ ప్రతాప్, సంఘాల రైతు మిత్రలు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ విభాగం, రెడ్ రిబ్బన్ క్లబ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రిన్సిపల్ రఘురామ్మూర్తి మాట్లాడుతూ రక్తదానం చేయడానికి విద్యార్థులు ముందుకు రావడం హర్షణీయమన్నారు. శిబిరంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, అధ్యాపకులు, 41మంది విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు రక్త దానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు

ఎమ్మెల్యే సురేంద్రబాబు

ప్రజాశక్తి-కుందుర్పి

దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అమలు చేస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. కుందుర్పిలో సోమవారం సర్పంచి గోవిందమ్మ అధ్యక్షతన నిర్వహించిన 'ఇది మంచి ప్రభు త్వం' కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం మహిళలకు దీపావళికు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అమలు చేస్తుందని, ఉచిత బస్సు ప్రయాణం కూడా త్వరలోనే అమలు చేస్తామన్నారు. ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. కర్నాటక సరిహద్దు గ్రామాల్లోని యువతను గత ప్రభుత్వ నాయకులు చెడు వ్యసనాలకు బానిసలుగా మార్చారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో ఇసుక అందుబాటులో ఉండేది కాదని, ప్రస్తుతం ఉచితంగా ఇస్తున్నామని, దీంతో భవన నిర్మాణ కార్మికులకు నిరంతరం పని దొరుకుతుందన్నారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైసిపి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి బకాయిలు చెల్లిస్తామని, బీటీపీ కాలువలు పూర్తి చేస్తామని, నియోజవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలుపుతామని తెలిపారు. కార్యక్రమంలో సురేఖరాణి, కళ్యాణదుర్గం రూరల్ సిఐ మణికంఠేశ్వర్, తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఒ జి.లక్ష్మీనరసింహ, ఎంఇఒ ఓబుళపతి, హెచ్ఎం తిప్పేస్వామి, అధికారులు వరప్రసాద్, చంద్రశేఖర్, మారుతి, ఎల్లప్ప, మహేష్, సిడిపిఒ వనజ అక్కమ్మ, టిడిపి మండల కన్వీనర్ ధనుంజయ, నాయకులు మల్లికార్జున, ఆర్‌జి.శివశంకరప్ప, రవి, రాఘవేంద్రబాబు, జనసేన ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి అంగడి చలపతి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ, అసెంబ్లీ కోకన్వీనర్ గంగాధర్, టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు, పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

కలెక్టరేట్‌లో రైతు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

తనకు సంబంధించిన భూమికి పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయలేదన్న మనస్తాపంతో ఓ రైతు కలెక్టరేట్ వద్ద ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల మేరకు గార్లదిన్నె మండలం కృష్ణాపురానికి చెందిన రైతు సూర్యనారాయణకు బూదేడు వద్ద 1.54 ఎకరాల భూమి ఉంది. ఈ భూమికి పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడంతో సోమవారం నాడు మనస్తాపంతో కలెక్టరేట్ ఎదుట పురుగుల మందు తాగాడు. వెంటనే స్పందించిన పోలీసులు అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

పౌష్టికాహార మహోత్సవం

గుమ్మఘట్ట : మండల కేంద్రంలోని 3వ అంగన్వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ అంజనమ్మ ఆధ్వర్యంలో సోమవారం పౌష్టికాహార మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పుట్టబోయే బిడ్డ కూడా ఆరోగ్యంగా పుడతారన్నారు. అంతేగాకుండా బిడ్డ ఎదుగుదలకు పోషకాహారం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి విజయలక్ష్మి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ ఆది భయమ్మ, మహిళా పోలీస్ హేమలత, అంగన్వాడీ వర్కర్లు చంద్రకళ, మంజుల, కామాక్షి, ఆయాలు సుశీల, వన్నూరమ్మ, అనసూయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-రాయదుర్గం

'స్వచ్ఛత హి సేవ'లో భాగంగా సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణలో మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప హాజరై మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైద్యులు మున్సిపల్ సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శారద, శ్రీలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, గోవిందరాజు లు, లావణ్య, ప్రశాంతి, పద్మజ, కో ఆప్షన్ సభ్యులు నజీర్, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ వెంకటేశులు, మాజీ కౌన్సిలర్లు సంపత్‌కుమారి, భారతి, నాయకులు పొరాలు శివ, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర, పారిశుధ్య కార్యదర్శులు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

కౌలు రైతుల గుర్తింపులో అధికారులు విఫలం

సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలో కౌలు రైతులను గుర్తించడంలో అధికారులు విఫలమయ్యారని సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి తెలిపారు. బొమ్మనహాల్‌లో సోమవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని 16 రెవెన్యూ గ్రామాల్లో నిజంగా కౌలు భూములు సాగు చేసి జీవించే రైతులు 8వేల మంది ఉన్నారన్నారు. వారికి భూ యజమానితో సంబంధం లేకుండా కౌలురైతు కార్డులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చినా అమలు చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. అధికారులు కేవలం 280 మందిని మాత్రమే గుర్తించి కౌలు కార్డులు మంజూరు చేయడం దారుణమన్నారు. తుంగభద్ర ఆయకట్టు కింద ఉన్న భూమి యజమానులు కౌలుకి ఇచ్చి పట్టణాల్లో కాపురం ఉంటే వారి పేరు మీదనే ఈ క్రాప్ బుకింగ్ చేశారన్నారు. తద్వారా భూ యజమానికి లబ్ధి చేకూర్చి కౌలురైతులకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు అర్హులైన కౌలురైతులందరికీ న్యాయం చేయాలని లేనిచో మండల వ్యాప్తంగా కౌలు రైతులను కూడగట్టి స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు.

కష్టపడి చదివి టీచర్ ఉద్యోగం సాధించాలి : ఎమ్మెల్యే కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

డీఎస్సీ శిక్షణ పొందుతున్న అభ్యర్థులు కష్టపడి చదివి ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని 74-ఉడేగోళం టెక్స్‌టైల్ పార్క్‌లో ఎమ్మెల్యే ఆర్థిక సాయంతో డీఎస్సీ ఉచిత శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. ఆ కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే సందర్శించారు. అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకొని ఉపాధ్యాయులై మీ కుటుంబాలకు ఆసరాగా నిలవాలని కోరారు. సమయాన్ని ఏమాత్రం వృథా చేయవద్దన్నారు.

భక్తుల మనోభావాలు దెబ్బతీసిన దుర్మార్గుడు జగన్

టెక్స్‌టైల్ పార్కులో ఎమ్మెల్యే కాలవ విలేకరులతో మాట్లాడుతూ పవిత్రమైన తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీసిన దుర్మార్గుడు మాజీ సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అన్నారు. తిరుమల ప్రసాదాన్ని అపవిత్రం చేయడంలో అసలైన దోషులు వైవి.సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి న్నారు. తిరుమల ప్రసాదాన్ని అపవిత్రం చేసిన కారకులను కఠినంగా శిక్షించాలన్నారు. వైసిపి హయాంలో సహజవనరులను దోచుకున్నారని, నాసిరకం మద్యం విక్రయించి కోట్లు వెనకేసుకున్నారన్నారు.

హంద్రీనీవా కాలువ సామర్థ్యం పెంచేందుకు చర్యలు

రాయలసీమ దత్తపుత్రుడిగా రైతుల బాధలు తీర్చాలన్న ఎన్టీఆర్ ఆలోచనతో పలు ప్రాజెక్టులు రూపకల్పనకు పురుడు పోసుకున్నాయన్నారు. అందులో హంద్రీనీవా సుజల స్రవంతి, గాలేరు నగరి, తెలుగు గంగ ప్రాజెక్టుల ద్వారా తాగు, సాగునీటి సమస్యను పరిష్కరించారన్నారు. అదే పరంపరను సిఎం చంద్రబాబు కొనసాగిస్తున్నారన్నారు. 2014-19 మధ్యలో హంద్రీనీవా, గాలేరు-నగరి ప్రాజెక్టుల కోసం రూ. 8,700 కోట్లు ఖర్చు చేశారన్నారు. 2019-24 మధ్య రూ. 500 కోట్లు కూడా ప్రాజెక్టులకు కేటాయించని జగన్ రాయలసీమ ద్రోహిగా నిలిచారన్నారు. మల్యాల నుంచి జీడిపల్లి వరకూ ఉన్న తొలిదశ హంద్రీనీవా కాలువ సామర్థ్యాన్ని 3850 క్యూసెక్కులకు పెంచేలా చర్యలు చేపడు తామని తెలిపారు. ఇందుకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హామీ ఇచ్చారన్నారు. హంద్రీనీవా కాలువ సామర్థ్యం పెరిగితే జీడిపల్లి ఆధారంగా బైరవానితిప్ప ప్రాజెక్ట్ కలలు నెరవేరుతా యన్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుతో కలిసి సిఎం చంద్రబాబును కలుస్తామని తెలిపారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ

ప్రజాశక్తి
www.prajasakti.com

పనిముట్లు ఇవ్వకుండా రోడ్లు శుభ్రం ఎలా..?

చెట్ల కొమ్మలతో రోడ్లు ఊడ్చి కార్మికుల నిరసన

ఆకులతో రోడ్లు ఊడుస్తూ నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు చెట్ల కొమ్మలు, అంగీలు, చీర కొంగులతో రోడ్లను శుభ్రం చేస్తూ సోమవారం వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు 1వ పట్టణ ప్రధాన కార్యదర్శి వై.వెంకటనారాయణ, 2వ పట్టణ అధ్యక్షులు ఎం.గురురాజా మాట్లాడుతూ అనంతపురం నగరపాలక సంస్థలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య, ఇంజనీరింగ్, మలేరియా, కోవిడ్, గార్బేజ్, క్లాప్‌తోపాటు వివిధ విభాగాల్లో పని చేస్తున్న కార్మికులకు పనిముట్లు, రక్షణ పరికరాలు, యూనిఫామ్ చీరలు, టవాళ్లు, చెప్పులు, సబ్బులు, కొబ్బరినూనె అందివ్వడం లేదన్నారు. అంతేగాకుండా సకాలంలో సరెండర్ లీవు ఇవ్వకుండా పనులు చేయిస్తున్నారన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు 11 నెలల ఇపిఎఫ్ బకాయి ఉందన్నారు. చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించకపోవడంతో కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. కావున ప్రతినెలా వేతనాలు సక్రమంగా చెల్లించాలని, ఇపిఎఫ్, ఇఎస్ఐ చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, క్లాప్ ఆటోడ్రైవర్లకు రూ.18,500 వేతనం అమలు చేయాలని, మున్సిపల్ కార్మికులందరికీ పక్కా ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. కాగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు హాజరైన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు సిఐటియు అనుబంధ మున్సిపల్ యూనియన్ నగర నాయకులు బండారు ఎర్రిస్వామి అధ్యక్షతన వినతిపత్రం అందజేశారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ 15 రోజుల్లో అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ కమిటీ సభ్యులు ప్రకాష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎటిఎం.నాగరాజు, నాగభూషణ, నగర ప్రధాన కార్యదర్శి తిరుమలేశు, కోశాధికారి లక్ష్మీనరసమ్మ, నగర మహిళా కన్వీనర్ మంత్రి వరలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, కోశాధికారి బత్తల.ఆదినారాయణ, రెగ్యులర్ యూనియన్ నగర అధ్యక్షులు ముత్తురాజు, కోశాధికారి నారాయణస్వామి, కమిటీ సభ్యులు ఆనంద్, మరియమ్మ, మిత్రసంఘాల నాయకులు వెంకటేష్, రాజు, నగర ఉపాధ్యక్షులు శేషేంద్రకుమార్, కమిటీ సభ్యులు శ్రీనివాసమూర్తి, శీన, ఆదినారాయణ, హిమాంబి, జయరామ్, నారాయణస్వామి, కుమార్, శివ, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

2023 ఖరీఫ్, రబీ బీమా ప్రకటించాలి

పెట్టుబడి సాయం రూ.20వేలు అందజేయాలి-వ్యకాసం, సిపిఎం ఆధ్వర్యంలో వినతులు

శింగనమలలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

2023 ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలుసాగు చేసి నష్టపోయిన రైతులకు వెంటనే బీమా పరిహారాన్ని ప్రకటించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం రూ.20వేలు ఇవ్వాలని, 2023 ఖరీఫ్, రబీ బీమా ప్రకటించాలని, సమగ్ర ఉచిత పంటల బీమా అమలు చేయాలని, జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని, రెండు లక్షల వరకూ రైతు రుణాలు రద్దు చేయాలని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించొద్దని, ప్రభుత్వమే టమోటా మార్కెట్‌ను ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని, భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అన్ని రకాల ఎరువులు, పురుగు మందులను రైతు సేవా కేంద్రాలు, సహకార సంఘాల ద్వారా రైతులకు సబ్సిడీతో అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల కార్యదర్శి కొండారెడ్డి, బాలరాజు, ఓబులేసు, శ్రీనివాసులు, సుంకన్న, ఓబిరెడ్డి, ఆంజనేయులు, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : రైతులకు పెట్టుబడి సాయం రూ.20వేలు ఇవ్వాలని, 2023 ఖరీఫ్, రబీ పంటల బీమాను వెంటనే ప్రకటించాలని సిపిఎం, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్ నాగరాజుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సూర్యనారాయణ, రమేష్, రైతుసంఘం నాయకులు ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు : రైతులకు పెట్టుబడి సాయం వెంటనే అందించాలని కోరుతూ ఏపి రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల నాయకులు ఎం.పోతులయ్య, బి.సుబ్బారెడ్డి, బి.చంద్రశేఖర్‌రెడ్డి, ఎ.ఎర్రిస్వామి, దండు శ్రీనివాసులు, వై.లక్ష్మీనారాయణ, కె.నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : 2023 రబీ, ఖరీఫ్ సీజన్లకు సంబంధించిన బీమా ప్రకటించాలని, పెట్టుబడి సాయం రూ.20వేలు రైతుల ఖాతాలకు జమ చేయాలని, ఇవ్వాలని వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించరాదని సిపిఎం, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఉరవకొండ, వజ్రకరూరు మండల కేంద్రాల్లో తహశీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో సిపిఎం ఉరవకొండ మండల కన్వీనర్ మధుసూదన్, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు జి.విరూపాక్షి, జ్ఞానమూర్తి, రైతుసంఘం నాయకులు మురళి, రామాంజనేయులునాయక్, హనుమంతురాయుడు, సుధాకర్, నాగేంద్ర, శివ, ఆంజనేయులు, నారాయణస్వామి, బాసా, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ : 2023 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన బీమా సాయాన్ని తక్షణమే ప్రకటించాలని ఏపి రైతుసంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహశీల్దార్ రజాక్‌వలికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా రాజారామిరెడ్డి, రైతులు నారాయణరెడ్డి, నరసింహారెడ్డి, రామ్మోహన్, పుల్లారెడ్డి, రాజేంద్రప్రసాద్ నాయుడు, రెడ్డి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కార్డుదారులందరికీ రేషన్ ఇవ్వాలి : సిపిఎం

వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

గుంతకల్లు రూరల్ : కార్డుదారులందరికీ తప్పనిసరిగా రేషన్ బియ్యం పంపిణీ చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బఫర్ పేరుతో పలువురు కార్డుదారులకు రేషన్ ఎగ్గొట్టడాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ డీలర్లను మార్చడంతో బఫర్ కారణంగా మండల వ్యాప్తంగా దాదాపు 1100 మందికిపైగా రేషన్ బియ్యం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. దీంతో రేషన్ బియ్యంపై ఆధారపడిన కుటుంబాలు పస్తులు ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ రేషన్ బియ్యంతోపాటు ఇతర సరుకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ రమాదేవికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు మారుతీప్రసాద్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, జగ్గలి రమేష్, పట్టణ కమిటీ సభ్యులు చంద్ర, ఓబులేష్, సురేంద్ర, అబ్దుల్లా, ఖాదర్, మస్తాన్, తిమ్మప్ప, షాషా, తదితరులు పాల్గొన్నారు.

ఎపిఎంగా నారాయణస్వామి

బుక్కరాయసముద్రం : డిఆర్‌డిఎ వెలుగు ఎపిఎంగా నారాయణస్వామి సోమవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను మహిళా సంఘాలకు అందజేసేందుకు యానిమేటర్లతో కలిసి కృషి చేస్తామన్నారు. అలాగే కొత్త సంఘాలను ఏర్పాటు చేసి రుణాలు ఇప్పించేందుకు సహకరిస్తామన్నారు. ఈ సందర్భంగా ఏసీ మద్దిలేటి, సీసీ ఈశ్వరయ్య, వెలుగు సిబ్బంది ఎపిఎంకు శుభాకాంక్షలు తెలిపారు.

స్వర్ణాంధ్ర ఎ-2047పై సమావేశం

పుట్లూరు : స్వర్ణాంధ్ర ఎ-2047 కార్యక్రమంపై సోమవారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర ఎ-2047 కార్యక్రమంపై సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ సిబ్బంది అధికారి విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సరోజ, విఆర్ఒ వెంకటనారాయణ, సచివాలయ సిబ్బంది, యువత రవి, నరసింహులు, సురేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎపిహెచ్ఎంఎస్ఎ జిల్లా అధ్యక్షుడిగా ఎస్ఎండి.షఫీ

ఉరవకొండ : ఎపిహెచ్ఎంఎస్ఎ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని రాకెట్ల పిహెచ్‌సిలో హెల్త్ ఎడ్యుకేటర్‌గా పని చేస్తున్న ఎస్ఎండి.షఫీ ఎన్నికయ్యారు. ఆదివారం అనంతపురంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి అనంతపురం జిల్లా కమిటీ ఎన్నికలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా షఫీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా కూడేరు పిహెచ్‌సిలో ల్యాబ్ టెక్నీషియన్ ఎస్.వేణుగోపాల్, ఉపాధ్యక్షుడిగా ఎ.రవీంద్రను ఎన్నుకున్నారు.

నేటి నుంచి 'పొలం పిలుస్తోంది'

ఉరవకొండ : మండలవ్యాప్తంగా నేటి నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి శుభకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులందరూ పాల్గొని పంటల్లో సస్యరక్షణ చర్యలు, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించే సూచనలు, సలహాలు, పాడి, పంటల్లో సమృద్ధిని ఎలా సాధించాలనే విషయాలపై చర్చించాలని కోరారు. మంగళవారం షేక్షనుపల్లి, లత్తవరంలో ఈ కార్యక్రమం నిర్వహిచనున్నట్లు తెలిపారు.

ఎంహెచ్‌పిఎస్ మండలాధ్యక్షుడిగా సురేంద్ర

ఆత్మకూరు : మాదిగ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షులుగా యనమల సురేంద్ర ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఎంహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పసలూరి ఓబిలేసు, జిల్లా అధ్యక్షులు మదిగుబ్బ ఓబుళప్ప ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబిలేసు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ మాదిగలు వివక్షకు గురవుతున్నారన్నారు. విద్యార్థులకు వసతులు లేక విద్యను మధ్యలోనే ఆపేస్తున్నారన్నారు. మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం తహశీల్దార్ లక్ష్మానాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిరంజీవి, నారాయణ, ఆదినారాయణ, ఓబులు, సర్దానప్ప, విజయ్, పెద్దన్న, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

25, 26న నియోజకవర్గ స్థాయి పోటీలు

ఉరవకొండ : ఈనెల 25, 26వ తేదీల్లో నియోజకవర్గ స్థాయి పాఠశాలల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు ఈశ్వరప్ప, రమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉరవకొండలోని ఎస్‌కె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగా, చెస్, షటిల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ విభాగాల్లో బాల, బాలికలకు ప్రత్యేకంగా ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

'అనంత'ను కలిసిన మాజీ ఎమ్మెల్యే వైవిఆర్

అనంతపురం : వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డిని గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి సోమవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన జిల్లా అధ్యక్షుడిగా నియామకమైనందున పుష్ప గుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచాలి

అనంతపురం కలెక్టరేట్ : సంక్షేమ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిద్ధు, ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచి నాణ్యమైన భోజనం అందేలా చూడాలన్నారు. శిథిలావస్థలో ఉన్న జిల్లాలో కొన్ని సంక్షేమ హాస్టళ్ల భవనాలను పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లలో ఖాళీగా ఉన్న వార్డెన్, వంట మనుషులు వాచ్‌మెన్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులు కలుపుకుని ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు భీమేష్, ఉపాధ్యక్షుడు సోము, పట్టణ సహాయ కార్యదర్శి గణేష్, నాయకులు సాయి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

అనంతపురం రూరల్ : విజయవాడ వరద బాధితుల కోసం అనంతపురం జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేకరించిన విరాళాల మొత్తానికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు అందజేశారు. సోమవారం నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ.40వేల చెక్కును ఎమ్మెల్యేకు అందజేశారు.

అధికారులు బదిలీ

యల్లనూరు : మండలంలోని పలు శాఖల్లో పని చేస్తున్న అధికారులను ఉన్నతాధికారులు బదిలీ చేశారు. డిప్యూటీ తహశీల్దార్ శ్వేతను పెద్దపప్పూరుకు, మండల విస్తరణ అధికారి విజయశేఖర్ నాయుడును తాడిమర్రికి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌ను గుంతకల్లుకు బదిలీ చేశారు. వీరితోపాటు ముగ్గురు పంచాయతీ సెక్రటరీలు కూడా బదిలీ అయ్యారు.

అండర్-14 జూడో జాతీయ పోటీలకు బికెఎస్ విద్యార్థి

బుక్కరాయసముద్రం : ఈనెల 22, 23వ తేదీల్లో తిరుపతిలో జరిగిన అండర్-14 రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో బుక్కరాయసముద్రం పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న దర్శన్‌తేజ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ గోపాల్‌రెడ్డి తెలిపారు. దర్శన్‌తేజ రాష్ట్రస్థాయి పోటీల్లో 30 కిలోల విభాగంలో ప్రథమ స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థిని ప్రధానోపాధ్యాయులు వసుంధర, పీడీ లలితమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉచిత మెగా కంటి వైద్యశిబిరం

యాడికి : మండల కేంద్రంలోని శివ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం ముందు శాంతిరామ్ ఆసుపత్రి వారు సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని టిడిపి మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా దాదాపు 2వేల మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్లు అవసరమైన వారిని కర్నూలు శాంతిరామ్ కంటి ఆసుపత్రికి సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి కాసా చంద్రమోహన్, ఎంపిటిసి అవుకు నాగరాజు, గొడ్డుమర్రి రామమోహన్, పామిశెట్టి నాగరాజు, వార్డుసభ్యులు గజ్జి బాలపెద్దయ్య, ఎస్సీ సెల్ కన్వీనర్ పండు శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి కోట చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

గుడిసెలు వేసుకున్న వారందరికీ పట్టాలివ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప

ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలందరికీ పట్టాలు మంజూరు చేసి పక్కా గృహాలు కట్టించి ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప, సిపిఎం నగర న్యూ కమిటీ కార్యదర్శి ఆర్‌వి.నాయుడు డిమాండ్ చేశారు. అనంతపురం రూరల్ పరిధిలోని ఉప్పరపల్లి పొలంలో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం నగర న్యూ కమిటీ ఆధ్వర్యంలో అనంతపురం రూరల్ మండలం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉప్పరపల్లి గ్రామ పంచాయతీ సర్వేనెంబర్ 194/8లో గ్రామకంఠ పొలంలో దాదాపు 600, కక్కలపల్లి పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 225/2 ఎలో 50 కుటుంబాలు కుటుంబాలు పేదలు గుడిసెలు వేసుకుని నివసిస్తున్నాయన్నారు. వీరందరూ పట్టణంలో అనేక వృత్తులు చేసుకుంటూ ఇంటి అద్దెలు కట్టలేక సిపిఎం ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. వీరందరికీ తక్షణమే పట్టాలు ఇవ్వడంతోపాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ మోహన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర న్యూ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, రామాంజినమ్మ, ప్రజాశక్తి నగర్ శాఖ కార్యదర్శి శ్రీనివాసులు, పెరుగు గోపాల్, గౌస్, అల్లా బకాసు, నరేంద్ర, నారాయణమ్మ, ప్రమీల, శంకర్, నల్లప్ప, వేణు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ-ఎంపిఆర్ దక్షిణ కాలువకు నీరు విడుదల



స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ, ఎంపి అంబికా

ప్రజాశక్తి-గార్లదిన్నె

రైతులను అన్నివిధాలా ఆదుకుని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మిడ్‌పెన్నార్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ దక్షిణ కాలువకు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి నీటిని విడుదల చేశారు. ముందుగా గంగమ్మకు చీర సమర్పించి పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటలను దృష్టిలో ఉంచుకుని పదిరోజులు ముందే నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం మాదిరిగా ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో కాకుండా 130 రోజులు నిరంతరాయంగా నీటిని సరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దిసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు, టిడిపి నాయకులు గేట్ కృష్ణారెడ్డి, పాండు, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు

'ఇది మంచి ప్రభుత్వం'లో నాయకులు

అనంతపురంలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-పామిడి

అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని కత్రిమల గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లో ప్రజలకు ఇచ్చిన అనేక హామీలను అమలు చేశామన్నారు. రానున్న రోజుల్లో కూడా ప్రతి కుటుంబానికీ సంక్షేమం, ప్రతి ఇంటికీ ప్రభుత్వ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎంపిడిఒ ప్రభాకర్‌నాయక్, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ ప్రభాకర్‌చౌదరి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ గౌస్‌పీరా, బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, పాళ్యం నారాయణస్వామి, జింకల సంజీవకుమార్, బొమ్మా మోహన్, కరూరు శివశంకర్, కాయల మహేష్, జనసేన ధను, సుంకప్ప, రవి, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : గత ఐదేళ్లలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేసి, రాష్ట్రాన్ని నాశనం చేశారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విమర్శించారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరంలోని సాయినగర్‌లో ఇంటింటికి వెళ్లి వందరోజుల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తూ.. కరపత్రాలు పంపిణీ చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే రాష్ట్రం ఎన్ని కష్టాల్లో ఉన్నప్పటికీ... ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, బిజెపి జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, బిజెపి రాష్ట్ర కార్యదర్శి లలిత్‌కుమార్, జనసేన రాయలసీమ అధ్యక్షురాలు పెండ్యాల శ్రీలత, టిడిపి నాయకులు బుగ్గయ్యచౌదరి, సరిపూటి రమణ, సాకే లక్ష్మీ నరసింహా, స్వప్న, నారాయణస్వామి యాదవ్, మణికంఠ బాబు, సైఫద్దీన్, తాజుద్దీన్, మున్వర్, డిష్ ప్రకాష్, హేమలత, కడియాల కొండన్న, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం రూరల్ : అనంతపురం రూరల్ పంచాయతీ పరిధిలోని భైరవనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే దగ్గుపాటి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయరామ్ నాయుడు, బుగ్గయ్య చౌదరి, గాజుల ఆదెన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

గార్లదిన్నె : మండల పరిధిలోని పెనకచర్ల గ్రామంలో సోమవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నో ఆర్థిక సవాళ్లు, ఇబ్బందులు ఎదుర్కొంటూనే ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు అమలు చేస్తోందన్నారు. రానున్న రోజుల్లో కూడా మరిని పథకాలు అందజేసి ప్రజల మన్ననలు పొందుతామని తెలిపారు. తర్వాత స్వచ్ఛత హి కార్యక్రమం కింద పెనకచర్ల, ఇల్లూరు గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లు అందజేశారు. అనంతరం రూ.10లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డుకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు, సర్పంచి బచ్చలన్న, గేట్ కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, చల్లా నాగరాజు పాల్గొన్నారు.

ఇకెవైసికి సర్వర్ సమస్య



సర్వర్ కోసం ఎదురు చూస్తున్న రైతులు

యల్లనూరు : రైతుల ఇకెవైసికి సర్వర్ గండం పొంచి ఉంది. ఈనెల 23వ తేదీ వరకూ రైతులు ఇకెవైసిపి చేయించుకునేందుకు ప్రభుత్వం గడువు ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో స్థానిక సచివాలయంలో ఇకెవైసి చేయించుకునేందుకు రైతులు తరలివస్తున్నారు. అయితే సర్వర్ సక్రమంగా పని చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎంతసేపైనా సర్వర్ రాకపోవడంతో ఉసూరుమంటూ వెనక్కి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. సర్వర్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారులు ఇకెవైసి చేయించుకునేందుకు గడువు మరోసారి పొడిగించాలని రైతులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

గ్యాస్ సిలిండర్ పేలి దుకాణాలు దగ్ధం

అనంతపురం క్రైం : స్థానిక రుద్రంపేట బైపాస్‌లో గ్యాస్ సిలిండర్ పేలి దుకాణాలు దగ్ధమైన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. రుద్రంపేటకు చెందిన ప్రకాష్‌రెడ్డి స్థానిక ఆలమూరు రోడ్డులో టీస్టాల్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి యథావిధిగా కొట్టుకు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. అయితే రాత్రి 11.45 గంటల సమయంలో పేలుడు శబ్దం వినిపించింది. స్థానికులు వచ్చి చూసేసరికి ప్రకాష్‌రెడ్డి టీస్టాల్ మంటల్లో దగ్ధమవుతూ కనిపించింది. స్థానికులు మంటలు ఆర్పడానికి ప్రయత్నించగా దుకాణం లో ఉన్న సిలిండర్ పేలి మంటలు పక్కనే ఉన్న సెలూన్‌కి వ్యాపించాయి. స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేయడంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పి వేశారు. ఒక్కో షాపునకు రూ.2 లక్షలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

గొర్రెలు అపహరణ

యల్లనూరు : మండల పరిధిలోని గడ్డంవారిపల్లి గ్రామంలో శ్రీనివాసులుకు చెందిన 15 గొర్రెలు చోరీకి గురయ్యాయి. బాధిత కాపరి తెలిపిన వివరాల మేరకు.. శ్రీనివాసులు తన భార్యతో కలిసి గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగించేవారు. తనకున్న 200 గొర్రెల్లో 14 గొర్రెలు, ఒక పొట్టేలు కనిపించలేదన్నారు. వీటి విలువ సుమారు రూ2లక్షల వరకూ ఉంటుందన్నారు. చుట్టుపక్కల గ్రామాలతోపాటు గొర్రెల మందల్లో వెతికినా కనిపించలేదన్నారు. దీంతో చేసేది లేక స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

యల్లనూరు : మండల పరిధిలోని వాసాపురం గ్రామానికి చెందిన సురేష్ అలియాస్ సూరి అదే గ్రామానికి చెందిన ఓ మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించాడని సోమవారం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామప్రసాద్ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

పుట్లూరు : విద్యుదాఘాతంతో ఎనుము మృతిచెందిన ఘటన సోమవారం సాయంత్రం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద అర్త్ ఫెయిల్ కావడంతో పక్కనే ఉన్న పుట్లూరుకు చెందిన కేశవరెడ్డి ఎనుముకు షాక్ కొట్టి మృతిచెందింది. దీని విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు. రోడ్డుకు ఆనుకుని ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతోనే ప్రమాదం చోటు చేసుకుందని తెలిపారు.

మహారాజశ్రీ గుత్తి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. NO:50/2022 in O.S.NO:146/2010

Between:
పి.చంద్రశేఖర్ రెడి ...అర్జీదారుడు/డి.హెచ్.ఆర్
ఎదిరి
వెలమకూరు పెద్దక్క Died by L.Rs
1.వి.సిద్దయ్య
2.వి.వెంకటలక్ష్మి
3.శ్రీమతి నాగరత్నమ్మ ...రెస్పాండెంట్స్/జె.డి.ఆర్స్

To
రెస్పాండెంట్ నెంబర్.2&3/జె.డి.ఆర్ నెంబర్ 2&3
R2:వెలమకూరు వెంకటలక్ష్మి D/o లేట్ వెంకటప్ప Now Residing at గడ్డమింద వీధి, వజ్రకరూరు గ్రామము & మండలం.అనంతపురం జిల్లా.
R3:శ్రీమతి నాగరత్నమ్మ D/o వి.సిద్దయ్య Residing of న్యూ రూమ్స్, ఎల్లనూరు గేట్ దగ్గర, గన్నేవారిపల్లి గ్రామము, తాడిపత్రి మండలం.అనంతపురం జిల్లా.

రెస్పాండెంట్ నెంబర్.2&3/జె.డి.ఆర్ నెంబర్ 2&3లకు నోటీసులు U/O.21 R.64 OF C.P.C

పై అర్జీలో అర్జీదారుడు తనకు మీ నుంచి రావలసిన డిక్రీ మొత్తమును రాబట్టుకొను నిమిత్తము మీ స్వధీన అనుభవములోని స్థిరాస్తిని వేలము వేయ నిమిత్తము పై అర్జీని దాఖలు చేసుకొని ఉన్నాడు. సదరు అర్జీని కోర్టు వారు వేలము షరతులను నిర్ణయించు నిమిత్తము 04/10/2024వ తేదిన వాయిదా వేసి ఉన్నారు. కావున ఆ దినము మీరు ఉదయం 10:30 గంటలకు పై కోర్టు ఎదుట ఖుద్దున గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీ అభ్యంతరములు తెలుపుకొనవచ్చును.లేని యెడల మీ పరోక్షములో కోర్టు వారు తీర్మానము చేయుదురు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
సి.రమేష్ నాథ్ రెడ్డి,M.A.LLB,
వై.హనీఫ్ బాషా,B.Com,B.L,
అడ్వకేట్స్, తాడిపత్రి,
జెడ్.సతీష్, B.A.LLB,
అడ్వకేట్,గుత్తి.

మహారాజశ్రీ గుత్తి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.NO:11/2023

Between:
యస్.నారాయణమ్మ మరియు ఇతరులు ...వాదులు
ఎదిరి
యు.హరినారాయణ మరియు ఇతరులు ...ప్రతివాదులు

4వ మరియు 18వ ప్రతివాదులకు దావా సమనులు
(4):బట్టా చంద్రశేఖర్ నాయుడు S/o బి.భాస్కర్ నాయుడు, నిట్టూరు కొత్తపల్లి గ్రామం, యాడికి మండలం, అనంతపురం జిల్లా.
(18):తలారి శోభారాణి W/o బోయ శంకర్, ఇం.నెం:4/190-1, చందన గ్రామం, యాడికి మండలం, అనంతపురం జిల్లా.

పై దావాలోని వాదులు భాగ పరిష్కారము కోరుతూ దావాను దాఖలు చేసి యున్నారు. సదరి దావాలో 4 మరియు 18వ ప్రతివాదులైన మీరు దావా సమనులు తీసుకొనకుండా వున్నందు వలన మీకు పత్రికా ముఖమున దావా సమనులు జారీ చేయుటకు కోర్టు వారు అనమతి యిచ్చివున్నారు. పై దావా మీ హాజరు నిమిత్తం 14/10/2024వ తేదిన వాయిదా వున్నది.కావున మీరు పై దావాలో పై కోర్టు వారి ఎదుట సదరి తేదిన ఉదయం 10:30 గం॥లకు హాజరై ప్రత్యుత్తరము యివ్వవలెను. లేని యెడల మీ పరోక్షమందు పై దావా కోర్టు వారిచే తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
సి.రమేష్ నాథ్ రెడ్డి,M.A.LLB,
వై.హనీఫ్ బాషా,B.Com,B.L,
అడ్వకేట్స్, తాడిపత్రి,
జెడ్.సతీష్, B.A.LLB,
అడ్వకేట్,గుత్తి.

మహారాజశ్రీ అనంతపురం అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.P.NO:37/2023

Between:
మాదిగ హనుమేష్ ...వాది
మరియు
1.అయ్యప్ప రెడ్డి, 2.గోపాల్, 3.బళ్లారి మల్లికార్జున, 4.శర్మాస్ వలి, 5.శేఖర్, 6.అయ్యప్పరెడ్డి, 7.ఆదెప్ప, 8.వన్నూర్ వలి, 9.జయప్ప, 10.రవి
...ప్రతివాదులు 1 నుండి 10

ప్రతివాదులు 7 మరియు 10 లకు నోటీసు
7వ ప్రతివాది:
ఆదెప్ప S/o బగ్గయ్య, సంకెపల్లె గ్రామం, ముదిగుబ్బ మండలం, పుట్టపర్తి, శ్రీ సత్యసాయి జిల్లా. సెల్:6303886030
10వ ప్రతివాది:
రవి S/o Not Know బెలుగుప్ప-తాండ, బెలుగుప్ప మండలం, అనంతపురం జిల్లా.సెల్:9505195600

పై కేసు నందు వాది తనను దివాలాదారునిగా డిక్లేర్ చేయమని వేసిన కేసును పై కోర్టునందు దాఖలు చేసియున్నారు. మీ యొక్క అనగా ప్రతివాదులు 7 మరియు 10లు హాజరు కొరకు పై కోర్టు వారు పై కేసును తేది 03/10/2024 నకు వాయిదా వేసి యున్నారు. కావున పై కేసులో మీకు ఏమైనా అభ్యంతరాలు వున్న యెడల పై తేదిన పై కోర్టు నందు ఉదయం 10:30 ని॥లకు మీరు స్వతహాగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై తెలుపుకొనవచ్చును. లేని యెడల పై అర్జీనందు మీకు పరోక్షమున గౌరవ కోర్టు వారు తీర్మాణము చేయుదురు.

(గౌరవ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
డి.సి.శేఖర్, యం.పి.భార్గవి,
అడ్వకేట్స్ గుంతకల్లు.
యం.శ్రీనివాసులు,
అడ్వకేట్ అనంతపురం.
సెల్:9346983123,8019917232